

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:24 (మంగళవారం సాయంత్రం)
సహర్ : 4:42 (బుధవారం ఉదయం)

వరాలిస్తారా..

- నేటి నుంచి అమరావతిలో జిల్లా కలెక్టర్ల సదస్సు
- కోనసీమ నుంచి హాజరుకానున్న కలెక్టర్ మహేష్‌కుమార్
- ప్రధాన సమస్యలపై సీఎంకు ప్రత్యేక నివేదిక ఇవ్వనున్న కలెక్టర్
- జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరుపై వివరణ



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అమరావతిలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంగళ, బుధవారాల్లో జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. కోనసీమ జిల్లాలో కీలకంగా కూటమి ప్రభుత్వంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కీలక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ సహకారం కోరుతూ ప్రత్యేక నివేదికను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సమర్పించనున్నట్టు తెలిసింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ జిల్లాలో సాధించిన ప్రగతితోపాటు చేపట్టాల్సిన ప్రాజెక్టులు, పరిష్కరించాల్సిన ఇతర సమస్యలపై నివేదికను సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జిల్లా కలెక్టర్లు జిల్లాలో చేపట్టాల్సిన కీలక ప్రాజెక్టులు, ఇతర అంశాలకు సంబంధించి నివేదికలను ఇవ్వడంతోపాటు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీటిని కాన్ఫరెన్సులో వెల్లడించే అవకాశాలు ఉన్నాయి. దీనిలో భాగంగా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సూచనలతో కూడిన నివేదికను ఇవ్వనున్నారు. ప్రధానంగా జిల్లాలో రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని సాగునీరు, మంచినీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న ప్రణాళికలను నివేదించనున్నారు. అలాగే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఉచిత ఇసుక విధానం ఇసుక రీచ్‌లు అధికంగా ఉన్న కోనసీమ జిల్లాలో అమలవుతున్న తీరును కూడా ప్రస్తావించనున్నారు. ఇటీవలే ఉపాధిహామీ పథకం అమలులో అత్యధిక పనిదినాలు కల్పించడంలో రాష్ట్రంలోని కోనసీమ జిల్లాకు అగ్రస్థానం లభించింది. వీటితోపాటు జిల్లాలో అమలుకానున్న హౌసింగ్ స్కీములు, ఇతర సంక్షేమ పథకాలు, అలాగే ప్రభుత్వపరంగా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించనున్నారు. ముఖ్యంగా జిల్లాలో చేపడుతున్న రైల్వేలైన్ నిర్మాణాలు, జాతీయ రహదారుల విస్తరణకు భూసేకరణ కొన్నిచోట్ల అడ్డంకిగా మారడంతో ఆ ప్రాజెక్టుల పురోగతిలో అవరోధం కలుగుతున్న అంశాలను కూడా కలెక్టర్ల సదస్సులో కీలకంగా చర్చించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. అలాగే వేసవిలో చేపట్టాల్సిన డ్రెయిన్లు, పంటకాల్వల అభివృద్ధి పనులకు నిధులు కోరనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా గోదావరి నదీకోతకు గురవుతున్న లంక భూములను పరిరక్షించుకునేందుకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు వంటి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరనున్నారు. అవేవిధంగా జిల్లాల పునర్విభజనలో ఏర్పడ్డ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట ఉండేలా కాంప్లెక్సు నిర్మాణానికి భూసేకరణ, నిధుల సమీకరణ వంటి అంశాలపై కూడా కలెక్టర్ సీఎం అధ్యక్షతన జరిగే సదస్సులో ప్రభుత్వానికి నివేదిస్తారు. కాగా కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు కలెక్టర్ మహేష్‌కుమార్ మంగళవారం ఉదయానికి అమరావతికి చేరుకుంటారు.

ఈసారి కాస్త భిన్నంగా...

ప్రతిసారి కలెక్టర్ల సదస్సులో ఆయా రాష్ట్రశాఖలకు చెందిన అభివృద్ధి అంశాలు, పనుల ప్రగతిపై సీనియర్ ఐఏఎస్‌లు అయిన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు గంటల తరబడి ప్రజెంటేషన్లు ఇచ్చేవారు. వీటిలో చేయాల్సిన, వెనుకబడిన అంశాలను గుర్తించి జిల్లా కలెక్టర్ వాటిని నోట్ చేసుకుని తిరిగి జిల్లాకు వచ్చి అధికారులతో సమీక్ష జరిపేవారు. ఈసారి ప్రభుత్వం ఈ పంథా మార్చింది. కార్యదర్శుల సుదీర్ఘ ప్రజెంటేషన్ల స్థానే నేరుగా జిల్లా కలెక్టర్లే తమ జిల్లాకు సంబంధించి శాఖలవారీగా ప్రగతి, ముఖ్య సమస్యలు, మూడు నెలల్లో వివిధ అంశాల్లో సాధించాల్సిన అభివృద్ధి, లక్ష్యాలపై ప్రజెంటేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాలో 30 ప్రభుత్వశాఖలకు సంబంధించి పనితీరు నివేదికను తయారుచేశారు. ఇవికాకుండా ప్రధాన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, నిధుల మంజూరు అవసరం వంటివి వివరించనున్నారు.



కోనసీమలో గౌతమీ గోదావరి నదీతీరంలో కోతకు గురవుతున్న లంక పొలాలు (ఫైల్‌ఫొటో)



నవమి తెచ్చింది కళ!

- కొబ్బరి రైతులకు కలిసొచ్చిన శ్రీరామనవమి
- ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా కొబ్బరి ఎగుమతులు
- నిత్యం 75 లారీలకు పైగా కోనసీమకు ఆర్డర్లు

6



మామూళ్ల.. మత్తు మందు!

డ్రగ్స్ అధికారుల ఎడిక్ట్!

- మామూళ్ల మత్తులో అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 3,500 షాపులు
- ఏడాదికి రూ.6 కోట్లు వసూళ్లు?
- ప్రతి దానికి ఒక రేటు నిర్ణయం
- తూతూ మంత్రంగా తనిఖీలు
- 'ఆపరేషన్ గరుడ' అంతంతే
- కన్నెత్తి చూడని డ్రగ్స్ యంత్రాంగం
- ఇష్టానుసారం వ్యాపారుల దోపిడీ
- మోసపోతున్న వినియోగదారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఔషధ నియంత్రాధికారులు నిద్దరోతున్నారు.. చుట్టూ దోపిడీ జరుగుతున్నా ఏం తెలియనట్టే వ్యవహరిస్తున్నారు.కళ్లెదుట దోపిడీ సాగుతున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ మనకెందుకొచ్చిందని వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సుమారు రూ.5 కోట్లు పైనే మామూళ్ల వసూళ్ల చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హడావుడిగా చేసిన తనిఖీలే అందుకు ఉదాహరణ.. 16 షాపుల్లో తనిఖీలు చేసి కేవలం 11 చిన్న కేసులే నమోదు చేశారు. ఉన్నతాధికారులకు తూతూ మంత్రపు నివేదిక పంపి చేతులు దులుపుకున్నారు.

మందుల ధరల బాదుడే..

ప్రస్తుతం మనిషికి ఔషధం అనేది నిత్యావసరం. ప్రతి ఇంటిలోనూ నెలకు వచ్చిన ఆదాయంలో సుమారు పది నుంచి 50 శాతం మందులకు ఖర్చు చేస్తున్నారంటే ఏమేరకు అవసరాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినా దోపిడీ మాత్రం ఆగడం లేదు. నిత్యావసర మందుల ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అయినా అడిగేవాడులేడు. పట్టించుకునేవారు అసలే లేరు.. మందులు ఎంత అంటే అంత పెట్టి కొనాల్సిందే. మెడికల్ షాపుల్లో నకిలీ మందులు ఇబ్బడి ముబ్బడిగా ఉంటున్నా ఇటీవల చేసిన తనిఖీల్లో ఒక్కటీ పట్టుకోలేకపోవడం కొసమెరుపు. మరోవైపు మందుల ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నా అడిగే నాథుడు లేడు. బీపీకి వాడే ఇస్పిన్ 10 ట్యాబ్లెట్ల ట్రిప్ కరోనాకు ముందు రూ.28 వరకూ ఉండేది. ప్రస్తుతం రూ.82 తీసుకుంటున్నారు. ఇలా అనేక రకాల మందుల ధరలు పెంచేసి విక్రయిస్తున్నారు. జనరిక్ మెడికల్ షాపుల్లోనూ అధిక ధరలకు అమ్మేస్తున్నా కనీస తనిఖీలు కానరావడం లేదు. మరోవైపు ఆన్‌లైన్‌లోనూ మందులు అమ్మేస్తున్నారు. ఇంకోవైపు మత్తు టాబ్లెట్ల వాడకం పెరిగినట్టు సమాచారం. మొన్న శనివారం చేసిన తనిఖీల్లో భాగంగా రాజమహేంద్రవరంలోని తిరుమల శ్రీనివాస మెడికల్ ఏజెన్సీలో ట్రమడాల్ ఇంజక్షన్లు ఉండాల్సిన స్టాకుకంటే తక్కువగా ఉండడమే ఉదాహరణ. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు.

16 షాపులు.. 11 కేసులు

మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే కారణంతో ప్రభుత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ గరుడ' పేరుతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్, ఈగల్, పోలీసు తదితర అధికారుల బృందాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16 షాపులపై దాడులు చేశారు. ఈ 16 షాపుల జాబితా ముందే సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో 8, కాకినాడ జిల్లాలో 4, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 దుకాణాలపై దాడులు చేశారు. తనిఖీల్లో పెద్ద కేసు లేమీ పెట్టలేదు. స్టాక్ రికార్డుకు.. స్టాక్‌కు మధ్య తేడా ఉన్నట్టు 11 చోట్ల నమోదు చేశారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్నారనే కారణంతో నాలుగు కేసులు నమోదు చేశారు. అనుమానం వల్ల మూడుచోట్ల శాంపిల్స్ తీసుకున్నారు. రెండుచోట్ల ట్రమడాల్ ట్యాబ్‌లెట్లు ఎవరికి విక్రయించారనే దానిపై ఆరా తీశారంతే. కానీ వీటి వివరాలేమీ అధికారికంగా డ్రగ్స్ ఏడీ ఆఫీసు చెప్పకపోవడం గమనార్హం. విజిలెన్స్ అధికారులు మాత్రం వివరాలిచ్చారు. మందుల షాపుల్లో జరుగుతున్న దందా ఏమైందో మరి.



రాజమండ్రిలో తనిఖీలు చేసిన విజిలెన్స్ ఎస్పీ స్నేహిత (ఫైల్)

ప్రతీ దానికో రేటు..

ఎవరైనా మెడికల్‌షాపు పెట్టుకోవాలంటే పదో తరగతి చదివితే చాలు. నాలుగేళ్ల అనుభవం ఉండాలి. కానీ ఫార్మాసిస్ట్ పర్యవేక్షణలో మందులు అమ్మాలి. డిగ్రీ చదివితే ఒక ఏడాది అనుభవంచాలు. ఎంత పెద్దషాపు పెట్టాలన్నా కేవలం 3 వేలు చలానా కడితే చాలు. లైసెన్స్ ఇవ్వడానికి మామూళ్లు భారీగానే ఇవ్వాలి. ఇక ప్రతి దుకాణం నుంచి ఆరు నెలలకోసారి రూ.5 వేలు వంతున మామూళ్లు ఇవ్వాలి. ప్రతి ఏటా ఇన్‌స్పెక్షన్ పేరిట వస్తే ఒక్కో షాపు కనీసం రూ.10 వేలు ఇవ్వాల్సిందే. ప్రతి షాపును ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఇది ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. కానీ దుకాణాన్ని బట్టి కనీసం రూ.25 వేల నుంచి మొదలవుతుంది. షాపు షిఫ్టింగ్‌కు రూ.15 వేల వంతున ఇవ్వాలి. ఇదంతా ఆయా ప్రాంతాల యూనియన్ నాయకులే స్వయంగా ఒక గుమస్తాతో వసూలు చేయిస్తారు. నెలకోసారో, వీలైనప్పుడో నేతలు స్వయంగా క్యాష్ బ్యాగ్ తీసుకుని వెళ్లి సదరు అధికారికి సమర్పించుకుంటారు. అక్కడి కొన్ని వాటాలు ఉంటాయి. ఇక్కడ కొందరు యూనియన్ నేతలు కూడా ఇష్టంలేని వారిపై దాడులు చేయిస్తారు. అప్పుడు అధికారులు వీరితో చేతులు కలుపుతారు. ఆరు నెలలకు దుకాణానికి రూ.5 వేల వంతున మొత్తం 3,500 దుకాణాల నుంచి రూ.1.75 కోట్ల మామూళ్లు వస్తాయని అంచనా. ఇన్‌స్పెక్షన్ పేరిట ఏడాదికి వసూలు చేసేది 3,500 దుకాణాల నుంచి రూ.3.50 కోట్లు. రెన్యూవల్‌కు ఐదేళ్లకోసారి రూ.5.25 కోట్లు వసూలు చేస్తారు. ఆకస్మిక తనిఖీలు, తప్పులు దొరికినప్పుడు వసూలు అదనం. ఆరు నెలల కిందట ఒక షాపు వద్ద డ్రగ్స్ దొరకడంతో భారీగా వసూలు చేసినట్టు ప్రచారం ఉంది.

అధికారులేం చేయాలి..

ఉమ్మడి తూర్పుగోదావరి, కొవ్వూరు డివిజన్ పరిధి కలిపి రాజమహేంద్రవరంలోనే డ్రగ్స్ ఏడీ కార్యాలయం ఉంది. దీని పరిధిలో మెడికల్ షాపులు, ఏజెన్సీలు సుమారు 3,500 వరకూ ఉన్నాయి. అవి కాకుండా ఆసుపత్రుల్లో కూడా మెడికల్ షాపులు ఉన్నాయి. బ్లడ్‌బ్యాంక్‌లు చాలా ఉన్నాయి. జిల్లా ఔషధ నియంత్రాధికారి కార్యాలయంలో ఏడీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. ఎవరు ఏ మందులు అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం అమ్ముతున్నారా అనేది పర్యవేక్షించాలి. కానీ సుమారు రెండేళ్లుగా ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయం నుంచి సరైన సమాచారం ఉండడం లేదు. నెలవారీ ఎన్ని శాంపిల్స్ తీశారో.. ఎక్కడ కేసులు పెట్టారో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే మామూళ్లు వసూళ్లు చేసుకుంటూ మత్తులో జోగుతున్నారు.. రూ.కోట్లు గడిస్తున్నారు. ప్రజలు మాత్రం పెద్దఎత్తున మోసపోతున్నారు.

మార్కెట్ విలువలపై వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి : జేసీ నిశాంతి



అమలాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భూసేకరణకు సంబంధించి మార్కెట్ విలువలపై వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి తగు న్యాయం చేకూర్చాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులకు సూచించారు. వివిధ ప్రాజెక్టులు, నివేసన స్థలాల కోసం భూసేకరణలు జరిగాయన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించి భూముల మార్కెట్ విలువల డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్, మండపేట, రామచంద్రపురం సబ్‌రిజిస్ట్రార్‌లు, రెవెన్యూ అధికారులకు భూసేకరణకు సంబంధించి భూములు కోల్పోయిన వారి నుంచి మార్కెట్ విలువలపై వస్తున్న ఫిర్యాదులపై జేసీ సమీక్షించారు. ఇటీవల మండపేట, రామచంద్రపురం మండలాల నుంచి రెండు ఫిర్యాదులు అందాయని వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, మార్కెట్ విలువల డీఐజీ వెంకట భీమేశ్వరరావు, ఆడిటర్ జేవీఎస్ జయలక్ష్మి, మండపేట సబ్‌రిజిస్ట్రార్ కేవీఎస్ కుమార్‌రావు, రామచంద్రపురం రిజిస్ట్రార్ టీవీఎస్ శ్రీనివాసరావు, తహసీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్‌లు పాల్గొన్నారు.

నేడు సహాయ పర్యావరణ ఇంజనీర్ల పోస్టులకు రాత పరీక్ష

అమలాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం సమాయ పర్యావరణ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం రాత పరీక్ష నిర్వహణ సన్నద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో సహాయ లైబ్రేరియన్ పోస్టులు, సహాయ పర్యావరణ ఇంజనీర్లు, ఎనలిస్ట్ గ్రేడ్-2 పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానించిందన్నారు. జిల్లా నుంచి సహాయ పర్యావరణ ఇంజనీర్ పోస్టుల కోసం 340 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికోసం కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో 165 మంది అభ్యర్థులకు, భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 175 మందికి రాత పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, సమన్వయ అధికారులుగా జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంబీ అలీలను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుశాఖ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు జిరాక్సు షాపులను మూసివేయించాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రెండు పరీక్షా కేంద్రాలకు అభ్యర్థుల రాకపోకలకు వీలుగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సమావేశంలో సర్వీస్ కమిషన్ సెక్షన్ అధికారి కె.భాస్కరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు పాల్గొన్నారు.

రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో

కోనసీమ కలెక్టరేట్ జట్టు విన్నర్

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

7



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

కలెక్టరేట్‌లో 335 అర్జీలు స్వీకరణ

అమలాపురం టౌన్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల్లో నమ్మకాన్ని పెంచేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సకాలంలో నాణ్యతతో కూడిన పరిష్కార మార్గాలు చూపడంతోపాటు రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా దివ్యాంగుల వద్దకు వెళ్లి వారి వినతులు స్వీకరించి సమస్యలను విన్నారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిలా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 335 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనల వెల్లువ

అమలాపురం టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా న్యాయం పొందాలని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అత్యధికంగా 335 అర్జీలను స్వీకరించడం ఇదే తొలిసారి. అలాగే వివిధ సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు, ధర్నాలు, నిరసనలతో హోరెత్తించారు. తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్‌లో రూ.7,870 వేతనానికి పనిచేస్తున్నామని, టెండరుకాలం పూర్తయినందున రూ. 18,500 జీతం చెల్లించాలని సిబ్బంది నిరసన తెలిపారు. వన్నెచింతలపూడి పల్లిపేటలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పరమట దుర్గాభవానీ, సీతామహాలక్ష్మి, విజయలక్ష్మి, చీకురుమెల్లి శ్రీదేవి, సకిలే అరుణ నిరసన తెలిపారు.

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

అన్నివిధాలా నష్టపోతున్న ఆక్వా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. తొలుత జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆక్వా రైతులు కొంకాపల్లిలోని క్షత్రియ కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మోటారుసైకిల్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్రమ విద్యుత్ వసూళ్లను వెంటనే ఆపాలని, ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, ఆక్వా ఎగుమతిదారుల నియంతృత్వ ధోరణి నశించాలని, రొయ్యలకు మద్దతు ధర కల్పించాలని నినదించారు. రొయ్యల మేతకు వాడే ముడిసరుకుల ధరలు తగ్గినప్పటికీ రొయ్యల మేత ధరలు తగ్గలేదని కమిటీ జిల్లా ప్రతినిధులు దెందుకూరి సత్తిబాబురాజు, యాళ్ల వెంకటానందం, త్సవటపల్లి నాగభూషణంలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు అర్జీ అందించారు. జిల్లా కమిటీ ప్రతినిధులు రుద్రరాజు నానిరాజు, వేగిరాజు వెంకట్రాజు, గుమ్మళ్ల సురేష్, సత్తి శ్రీను, పోలిశెట్టి శివాజీ, మేడిద శంకరం, సూదా సత్తిబాబు, వాండ్రపు శ్రీను, మోటూరి నాని పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి...

స్మార్ట్ మీటర్ల రాకతో ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ప్రతినిధుల బృందం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపింది. ఉద్యోగ భద్రత కల్పించి తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని అభ్యర్థించారు. నిరసనలో జిల్లాశాఖ అధ్యక్షుడు పెట్టా నాగబాబు, కార్యదర్శి తోట దుర్గాప్రసాద్, ఆర్.రాజు, వి.వెంకటేశ్వరరావు, శ్యామ్‌కుమార్, తాడి రమేష్ పాల్గొన్నారు.



కోనసీమ ఆక్వా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

అధికారులపై చర్యలు తీసుకోవాలి..

ఇళ్ల స్థల పట్టాలు ఇప్పిస్తామని రూ.1.20 కోట్లు వసూలు చేసిన గృహనిర్మాణ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని రావులపాలెం గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సెంటు ఇంటి స్థలానికి రూ.30వేలు, 2సెంట్ల స్థలానికి రూ.1.50 లక్షల చొప్పున గృహనిర్మాణశాఖ వర్క్ ఇనస్పెక్టర్ పమ్మి శ్రీహరి మురళీకృష్ణ వసూలుచేశారని ఇలా 80మంది నుంచి రూ.1.20 కోట్లు వసూలు చేసినట్టు ఆరోపించారు. తమను మోసం చేసిన గృహనిర్మాణశాఖ అధికారులపై విచారణ జరిపి, ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని ఓదూరి సోమరాజు తదితరులు అర్జీలో పేర్కొన్నారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది 17 ఏళ్ల సర్వీసును పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

27 అర్జీలు స్వీకరణ

అమలాపురం టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఎస్పీ రాతపూర్వకంగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు. 27 అర్జీలను ఎస్పీ స్వీకరించారు.



నవమి.. తెచ్చింది కళ!

- కొబ్బరి రైతులకు కలిసొచ్చిన శ్రీరామనవమి
- ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా కొబ్బరి ఎగుమతులు
- నిత్యం 75 లారీలకు పైగా కోనసీమకు ఆర్డర్లు
- రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- వెయ్యి కొబ్బరికాయల ధర రూ.14 వేలు

అంబాజీపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జనవరి తరువాత కొబ్బరికాయలకు మంచి ధర ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల్లో నుంచి ఆశించిన మేర ఆర్డర్లు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు సన్నగిల్లాయి. ఉగాది, శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో రైతులు, వ్యాపారులకు ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు రావడంతో ఆనందంగా ఉన్నప్పటికీ కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. శ్రీరామనవమి పండుగను దేశవ్యాప్తంగా వైభవంగా నిర్వహించుకోనున్న నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి కోనసీమ వ్యాపారులు, రైతులకు భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్ ఊపందుకుంది. గతేడాది ఇదే సమయంలో 20 నుంచి 25 లారీల ఎగుమతులు జరగగా, ప్రస్తుతం కోనసీమతోపాటు ఉభయగోదావరి జిల్లాల నుంచి 100 లారీలకుపైగా ఎగుమతులు జరుగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సోం, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌తోపాటు ఈ ఏడాది జమ్ముకాశ్మీర్ రాష్ట్రం నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉగాది సందర్భంగా కర్ణాటకలో గుడిపావడా పండుగను వైభవంగా నిర్వహిస్తారు. అక్కడ కొబ్బరికాయలను ఈ పండుగకు ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో ఆ రాష్ట్రానికి కొబ్బరి ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. అలాగే కేల్ కత్తాలో ప్రతి అమావాస్యకు ఆ ప్రాంత ప్రజలు కొబ్బరిని ఎక్కువగా వినియోగిస్తారు. ఈ ఏడాది శివరాత్రికి భారీగా ఆర్డర్లు వస్తాయని భావించిన రైతులు తమ కల్లాల్లో భారీగా కొబ్బరికాయల నిల్వ చేసుకుని ఉంచారు. అయితే శివరాత్రికి ఆశించినంత మేర ఆర్డర్లు లేకపోవడంతో రైతుల వద్దే కొబ్బరికాయల రాశులు నిలిచిపోయాయి. అయితే పండగలు పూర్తయినప్పటికీ ఎండలు పెరగడం వల్ల కూడా ప్రస్తుతం కొబ్బరి ఎగుమతులు భారీగా జరుగుతున్నాయని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పచ్చికొబ్బరికాయలు రూ.14 వేలు పైబడి కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి దిగుబడి తగ్గడం ఇక్కడ ఎగుమతులు ఊపందుకోవడానికి మరో కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా శ్రీరామనవమి ప్రభావం వల్ల ఈ స్థాయిలో ఎగుమతులు మరో నాలుగు రోజులు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నవమి మార్కెట్ పూర్తయితే ఎగుమతులు తిరిగి యథాస్థితికి వస్తాయని చెబుతున్నారు.



కాయలను లారీల్లో ఎగుమతి చేస్తున్న కూలీలు

వేధిస్తున్న కూలీల కొరత...

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడం లేదనే చందంగా మారింది కోనసీమలో కొబ్బరి రైతులు, వ్యాపారుల పరిస్థితి. కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ఎగుమతులు ఊపందుకున్నప్పటికీ ఒలుపు కార్మికులు, లోడింగ్ కూలీలు, లారీల కొరత వేధిస్తుండడంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్డర్లను సకాలంలో అందించలేకపోతున్నారు. దీనికితోడు లోడింగ్ చేసేవారు, లారీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో కొంతమంది వ్యాపారులు ఆర్డర్లు వచ్చినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్డర్లను తిరస్కరిస్తున్నారు.





కాకినాడ కలెక్టరేట్‌లో జాబ్‌మేళా కార్యక్రమానికి విచ్చేసిన నిరుద్యోగ అభ్యర్థులు

ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉద్యోగ మేళాకు.. భారీ స్పందన

- 350 పోస్టులకు గాను 1200మంది హాజరు
- అభ్యర్థులతో కిటకిటలాడిన కాకినాడ కలెక్టరేట్
- ఉభయగోదావరి జిల్లాలతోపాటు గుంటూరు, విజయవాడల నుంచి వచ్చిన నిరుద్యోగులు
- గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టింగ్ సంస్థలో ఉద్యోగాలు
- తొలిరోజు 125మంది ఎంపిక
- నేడు కూడా ఇంటర్వ్యూలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్ర జ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో వికాస సంస్థలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి 1200మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రధానంగా కాకినాడ జిల్లా కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి నిరుద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం 9గంటలనుంచి ఇంటర్వ్యూ ప్రక్రియ ప్రారంభమైంది. గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కంటెంట్ అనలిస్ట్ ఉద్యోగాలకు వాకిన్‌డ్రైవ్ నియామకాలు నిర్వహించారు. తొలిరోజు సోమవారం 1200మంది అభ్యర్థులు హాజరుకాగా 125మందికి ఉద్యోగాలు ఇచ్చారు. వీరు వర్క్‌ఫ్రం హోమ్ విధానంలో 8గంటలపాటు పనిచేయాల్సిఉంది. ఇంజినీరింగ్‌తోపాటు నాన్ ఇంజినీరింగ్ గ్రూప్ విద్యార్థులకు కూడా అవకాశం ఇచ్చారు. ఈ సంస్థ సేవలు హైదరాబాద్‌లోను ఉన్నాయి. అక్కడ పనిచేసే అభ్యర్థులకు వసతి సౌకర్యంతోపాటు భోజన వసతి కూడా కల్పిస్తున్నారు.

కిక్కిరిసిన కాకినాడ కలెక్టరేట్

ఉదయం 9గంటలకే కాకినాడ కలెక్టరేట్‌లో వికాస కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులతో ఆప్రాంతం కిక్కిరిసింది. అక్కడికి వచ్చిన కొందరికి దరఖాస్తులు ఇవ్వకపోవడం వల్ల అభ్యర్థులు ఎగబడ్డారు.ఈవిషయాన్ని గమనించిన వికాస ఉద్యోగులు తర్వాత అందరికీ దరఖాస్తులు అందేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులతో లోపల ప్రాంగణమంతా నిండిపోయి కోలాహలంగా దర్శనమిచ్చింది. వీరు కూర్చోవడానికి టెంట్లు ఏర్పాటు చేశారు.

ఆంగ్లంపై పట్టున్నవారికే అవకాశం

ఇంటర్వ్యూల్లో ఆంగ్ల భాషపై, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు ఉన్నవారికే ఉద్యోగాలు వచ్చాయి. సంస్థ ప్రతినిధులు 12మంది మూడు రౌండ్లలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళా మంగళవారంకూడా ఉంటుందని, అభ్యర్థులు వివరాలకు 7799376111, 7799376444 నెంబర్లలో సంప్రదించాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు.వికాస పీడీ లచ్చారావు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ కోసం వేచిఉన్న అభ్యర్థులు

రూ.87కోట్ల నీటి చార్జీలు చెల్లించండి

- కాకినాడలోని ఏడు పరిశ్రమలకు రెండోసారి నోటీసులు జారీ
- 15రోజుల్లోగా స్పందించకపోతే కఠిన చర్యలు: కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏడు పరిశ్రమలకు రూ.87కోట్లకుపైగా నీటి చార్జీలు చెల్లించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ రెండోసారి నోటీసులు జారీ చేశారు. వీటి నీటి వినియోగ చార్జీలు 2019నుంచి నేటివరకు రూ.87కోట్ల21లక్షల91వేల బకాయి ఉన్నందున వాటిని చెల్లించాల్సిందిగా ఈనెల 7న కలెక్టర్ మొదటిసారి నోటీసులు జారీ చేశారు. ఆయా పరిశ్రమలనుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మళ్లీ సోమవారం నోటీసులు జారీ చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోఉన్న నాగార్జున ఫెర్టిలైజర్స్, కాకినాడ సీపోర్టు, జీఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్, ఎంవీ శశిధర్ అండ్‌కో, అశోక్ ఎంటర్‌ప్రైజస్, అంజని ఏజెన్సీస్, అన్నపూర్ణ మెరైన్స్‌నుంచి రూ.87కోట్ల 21 లక్షల91వేల నీటి వినియోగ బకాయిలు చెల్లించాలని ఒకసారి నోటీసులుఇచ్చామని, ఆ పరిశ్రమలు స్పందించకపోవడంతో మళ్లీ నోటీసులు ఇచ్చామని తెలిపారు. దీనిపై 15రోజుల్లోగా స్పందించకపోతే తదుపరి కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

కాకినాడ జిల్లా మెప్మా గిన్నిస్ రికార్డు

- ఆన్‌లైన్ యాప్ ద్వారా లక్ష్యానికి మించి అమ్మకాలు
- మెప్మా పీడీకి కాకినాడ కలెక్టర్ అభినందనలు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మెప్మా మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు వావ్‌జెని ఆన్‌లైన్ యాప్‌ద్వారా లక్ష్యానికి మించి ఉత్పత్తులు విక్రయించినందుకు మెప్మా సంస్థ గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదించింది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ జిల్లామెప్మా పీడీ బిప్రియంవద కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఒక్కరోజులో లక్షకు పైగా ఉత్పత్తులు విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడంతో మెప్మా పీడీని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



కాకినాడ జిల్లా మెప్మా పీడీని అభినందిస్తున్న కలెక్టర్

ఏపీఈఏపీ సెట్‌కు 1,12,606 దరఖాస్తులు

- మే 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ
- అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు
- కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే,మార్చి24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2025కు ఇప్పటివరకూ 1,12, 606 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజనీరింగ్‌కు 86,282మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 26,075, రెండింటికీ 249మంది దరఖాస్తుచేసుకున్నారన్నారు. ఈప్రవేశపరీక్షకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని మే19 నుంచి 27వ తేదీవరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. ఏపీ వ్యా ప్తంగా 46, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2 కేంద్రాలు మొత్తం 48కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ కె.రాము, ఎన్.సుమతి కోకన్వీనర్లుగానూ, ప్రొఫెసర్లు చంద్రశేఖర్, రాజశేఖర్, దిలీప్‌కుమార్, ఉషాదేవి, జయప్రసాద్‌లు సభ్యులుగానూ నియామకమయ్యారు విద్యార్థులు https://cets. apsche. ap.gov.in వెబ్‌సైట్‌ద్వారా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను పూరించాలన్నారు.

● మే 19నుంచి 20వరకూ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలను మే 21నుంచి 27వ తేదీ వరకూ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. మే24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని 25న పరీక్ష ఉండదన్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి 12గంటల వరకూ, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకూ జరుగుతాయని తెలిపారు.



కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

● ఓసీ విద్యార్థులు రూ.600, బీసీ విద్యార్థులు రూ.550, ఎస్సీఎస్టీ విద్యార్థులు రూ.500 చొప్పున ఆన్‌లైన్ గేట్‌వే ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. రూ.1000 అపరాధ రుసుంతో మే1, రూ.2000తో మే7, రూ.4000తో మే 12, రూ.10,000 అపరాధ రుసుముతో మే 16వ తేదీవరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచు కున్న విద్యార్థులకు కర్నూలు ప్రాంతీయ కేంద్రంలో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని తెలిపారు. ఈఏడాది ఏపీఈఏపీసెట్ దరఖాస్తులో కొత్తగా అపార్ ఐడీ ఆప్షన్ ఇస్తామని ఇది ఆప్షనల్ మాత్రమేనని అపార్ ఐడీ లేకపోయినా పరీక్షకు అనుమతిస్తామన్నారు. కౌన్సెలింగ్ సమయానికి తమ ఇంటర్మీడియట్ కళాశాల ద్వారా అపార్ఐడీ పొందాల్సి ఉంటుందని ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హతున్న విద్యార్థులు దరఖాస్తులను పూరించేటప్పుడు నూతన ఆదాయ ధ్రువీకరణపత్రం నెంబర్‌ను నమోదు చేయాలన్నారు. అదేవిధంగా రిజర్వేషన్ పొందే విద్యార్థులు కులధ్రువీకరణ పత్రం నెంబర్‌ను నమోదుచేయాలని తెలిపారు.

● **5 కేంద్రాలను ఎంపిక చేసుకోవాలి**

విద్యార్థులు తప్పనిసరిగా తమకు సమీపంలోని 5 కేంద్రాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని వాటిని ప్రాధాన్యతా క్రమంలోఎవరు ముందుగా ఎంపిక చేసుకుంటారో వారికి మొదటి ప్రాధాన్యతా కేంద్రాన్ని కేటాయిస్తామన్నారు. ఈఏపీసెట్‌లో 75శాతం, 10+2 పరీక్షల్లోని గ్రూప్ మార్కుల నుంచి 25శాతం వెయిటేజీతో కలిపి ర్యాంకులు కేటాయిస్తామన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులో ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరిస్తే మే 6నుంచి 8వరకూ సవరించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. మే 12నుంచి విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వాటితోపాటూ ర్యాంకు కార్డులను ఈఏ పీసెట్ వెబ్‌సైట్‌తోపాటూ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికోసం https://cets. apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ 0884 2359599, 2342499 ఫోన్ నెంబర్లలోగానీ helpdeskapeapcet @apsche.org మెయిల్ ఐడీ ద్వారాగానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సుబ్బారావు సూచించారు.



సైబర్..ర్..ర్!

- సైబర్ నేరాల్లో పోగొట్టుకుంది రూ.18 కోట్లు
- అధికారులు వెనక్కి తెచ్చింది రూ.8 లక్షలు
- నాలుగేళ్లలో తూర్పున ఇదీ లెక్క
- లబోదిబోమంటున్న బాధితులు

రాజమహేంద్రవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైంలో జనాలు పోగొట్టుకున్న సొమ్ము వెనక్కి రావడం అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. గత నాలుగేళ్లలో పోలీస్ రికార్డులు చూస్తే గుండె గుబేల్ మంటుంది. సైబర్ నేరగాళ్లు దోపిడీ చేసింది భారీగా ఉంటే రికవరీ అయ్యి చేతికి వచ్చింది మాత్రం ఆవగింజంత మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలో గత నాలుగేళ్ల లెక్కలను పరిశీలిస్తే పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

గత నాలుగేళ్లలో సైబర్ నేరాల గణాంకాలు..

2022లో 114 సైబర్ నేరాలు జరగ్గా రూ. 1,34,43,000లు నష్టపోగా రూ.6,50,000లు హోల్డ్ చేశారు. వాటిలో రూ.1,40,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2023లో 101 సైబర్ నేరాలు జరగ్గా రూ.3,14,19,000లు నష్టపోగా రూ.17,82,000లు హోల్డ్‌చేశారు. వాటిలో రూ. 3,09,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2024లో 104 సైబర్‌నేరాలు జరగ్గా రూ. 10,10,51,000లు నష్టపోగా రూ. 1,62,47,000లు హోల్డ్ చేశారు. వాటిలో రూ. 3,75,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2025లో 25 సైబర్‌నేరాలు జరగ్గా రూ.2,76,40,000లు నష్టపోగా రూ. 7,30,000లు హోల్డ్ చేశారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. జిల్లాలో నమోదైన సైబర్ నేరాల గణాంకాలను పరిశీలిస్తే పోలీసులు అతిస్వల్పంగా కేసులు నమోదు చేసినట్టు తెలుస్తుంది. ప్రతిరోజు జిల్లా కేంద్రంలోని సైబర్ సెల్‌కి కనీసం 5కు పైగా ఫిర్యాదుదారులు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లను కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. సైబర్ నేరం జరిగిందని ఫిర్యాదుదారుడు పోలీస్ స్టేషన్‌కు వస్తున్నా కేసులు నమోదు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని బాధితులు వాపోతున్నారు. తీరా కేసులు నమోదు చేసినా ఆ కేసులు విచారణకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నేటి నుంచి ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో పరీక్షలు

● జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కంప్యూటర్ బేసిడ్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఏపీపీఎస్సీ అధికారులు, రెవెన్యూ, ప్రజారవాణా, పోలీస్, వైద్యఆరోగ్యం తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ హెల్త్ సైన్స్ అసిస్టెంట్ లైబ్రేరియన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, అనలిస్ట్ గ్రేడ్-2, ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్‌డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల ఉద్యోగుల భర్తీకి సంబంధించి ఈనెల 25నుంచి 27వరకు మూడు రోజుల పాటు జిల్లాలో నిర్వహించే కంప్యూటర్ బేసిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్షల నిర్వహణకుగాను జిల్లాలో కాకినాడ పట్టణంలో ఎస్. అచ్యుతాపురం వద్ద నున్న అయాన్ డిజిటల్ టెక్నాలజీ, కాకినాడరూరల్‌లోని స్వాప్ టెక్నాలజీ, సూరంపాలెంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల నేపథ్యంలో ఈమూడు కేంద్రాల పరిధిలోని మండలాల్లో 144 సెక్షన్ కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. మూడురోజులు రెండుపూటలా ఉదయం, మధ్యాహ్నం జరిగేపరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఎండవేడి ఎక్కువగా ఉంటున్నందున వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి అవసరమైన ఓఆర్ఎస్ ఇతర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 8గంటల నుంచి 8.45 వరకు మధ్యాహ్నం 1గంట నుంచి 1.45 నిమిషాల వరకు అనుమతిస్తామన్నారు. ఉదయం పరీక్ష 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి ప్రశాంత్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా 5వేల క్యూసెక్కులు గోదావరిడెల్టాకు విడుదలవుతుండగా మరో 4వేల క్యూసెక్కులు పైబడి పవర్ జనరేషన్‌ద్వారా విడుదలవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 10,468క్యూ సెక్కులుగా నమోదుకాగా ధవళేశ్వరంవద్ద నీటి మట్టం 9.70అడుగులుగా నమోదైంది.

భావనారాయణస్వామికి రూ. 2,11,500 ఆదాయం

సర్పవరం జంక్షన్, మార్చి24 (ఆంధ్ర జ్యోతి): కాకినాడరూరల్ సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామిస్వామి ఆలయంలో చేపలచెరువు, ఫొటో, వీడియోలు తీసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంపాటలో రూ.2,11,500లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఈవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో స్వామివారికి చెందిన చేపల చెరువుకి 3నెలల కాలపరిమితికి వేలంపాట నిర్వహించగా, హెచ్చుపాటకు రూ.1,08,000లకు పాడుకున్న వ్యక్తికి వేలంపాట ఖరారు చేశామన్నారు. వివాహాది, శుభకార్యాల ఫొటో, వీడియోలు, వీడియోషూట్‌ల నిర్వహణకోసం లైసెన్స్ హక్కుకోసం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలో రూ.1,03,500 పాడిన వ్యక్తికి టెండర్ ఖరారు చేశామన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

మరిడమ్మ హుండీ ఆదాయం రూ4.61లక్షలు

పెద్దాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయ ధర్మాదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మి తెలిపారు. 97 రోజులు కాలానికి రూ.4,61,845 ఆదాయం సమకూరిందని ఆమె తెలిపారు. అన్నదాన హుండీల ద్వారా 129 రోజుల కాలానికి రూ.43,069 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి అధ్యయనోత్సవాలు

● వాడపల్లిలో ఉత్సవాలకు ఏర్పాట్లు

ఆత్రేయపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలకు ముందుగా స్వామివారి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 29 వరకూ జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ద్రవిడ వేద పారాయణం, పల్లకి మహోత్సవం, గరుడ, సింహ వాహనసేవలు జరుగుతాయి. ఏప్రిల్ 7నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు జరుగనున్నాయి. సోమవారం తిరుమంజన సేవా కాలం నిర్వహించారు. భక్తులకు స్వామి నిజరూప దర్శనం కలిగింది. అశేష భక్తజనం దర్శించుకున్నారు. ఇదిలావుండగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నోము ఆచరించి, అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామి దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,95,811 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గంజాయికి.. గోదారి

రూటు మార్చిన స్మగ్లర్లు

● ఒడిశా నుంచి వయా పోలిపాక మీదుగా తరలింపు

● పడవరేవును పరిశీలించిన తెలంగాణ ఎక్సైజ్ అధికారులు

కూనవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పోలీసుల తనిఖీలు ఎక్కువవుతుంటే మరోవైపు స్మగ్లర్లు సైతం తమ రూటును మార్చుకుంటున్నారు. వెళ్లినదారిలోనే వెళితే కిక్కు ఏముంది అనుకుంటున్నారో ఏమో కొత్త మార్గాలు అన్వేషించుకుంటూ తమ అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అయినా ఎక్కడో ఒక చోట పోలీసులకు దొరికిపోయి కటకటాల పాలవుతున్నారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ నుంచి గంజాయిని తెలంగాణకు తరలించాలంటే సాధారణంగా స్మగ్లర్లు భద్రాచలం మార్గం వైపు తీసుకెళ్తారు. కానీ అక్కడ తనిఖీలు ఎక్కువవుతుండడంతో కూనవరం మండలం పోలిపాక గోదావరి పడవ రేవును ఈసారి ఎంచుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఇక్కడి నుంచి సుమారు రూ.60.57లక్షలు విలువచేసే గంజాయిని తరలిస్తూ తెలంగాణలోని బూర్గంపాడు పోలీసులకు దొరికిపోయారు. ఈ వ్యవహారంలో మొత్తం తొమ్మిది మంది సూత్రధారులు ఉండగా ఇందులో కూనవరం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టు తెలంగాణ పోలీసులు నిర్ధారించారు. వీరిలో పోలిపాక గ్రామానికి చెందిన ఎడముత్యం వంశీతో పాటు గంజాయిని పడవ ద్వారా తరలించిన పడవ యజమాని ఎల్లాజీ కూడా ఉన్నట్టు అక్కడి డీఎస్పీ సతీష్ ఇటీవల జరిగిన అక్కడ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అయితే మండలంలో గంజాయి తరలింపు సంఘటన వెలుగులోకి రావడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ ఎక్సైజ్ అధికారులు మండలంలోని పోలిపాక పడవరేవును సైతం పరిశీలించారు. వాస్తవానికి పోలిపాక పడవరేవు ప్రభుత్వం ఆధీనంలో నడిచేది. పోచవరం కాలనీ పంచాయతీ అధికారులు ఈ పడవరేవు వేలంపాటను నిర్వహించేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో కచ్చులూరు లాంచీ ప్రమాదం జరగడంతో అక్కడి నుంచి పోలిపాక పడవరేవు వేలంపాటను నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ పడవ రేవు వేలంపాట నిర్వహించకపోవడంతో ఈ పంచాయతీకి సైతం ఆదాయమార్గం తగ్గిపోయింది. దీంతో కొంతమంది ప్రయివేట్ వ్యక్తులు ఇక్కడ పడవరాకపోకలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఇక్కడ అధికారికంగా పడవరేవు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.


పోలిపాక వద్ద రేవును పరిశీలిస్తున్న తెలంగాణ ఎక్సైజ్ అధికారులు

ఆర్థిక లావాదేవీల కారణంగా..
తమ్ముడిని చంపిన అన్న


మరణించిన సుగ్గిరెడ్డి

మారేడుమిల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం మారేడుమిల్లి మండలం తాడేపల్లి పంచాయతీ నీలవరం గ్రామంలో దారుణం జరిగింది. ఆర్థిక లావాదేవీల కారణంగా తమ్ముడిని అన్న విల్లంబులతో హత్య చేసిన ఘటన వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం సుమారుగా 11 గంటల సమయానికి తంబుడు సుగ్గిరెడ్డి అనే వ్యక్తిని తన అన్న అయిన తుంబుడు లచ్చిరెడ్డి సుగ్గిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు ఎప్పుడు ఇస్తావు అంటూ గొడవ పడి తన వెంట తీసుకువెళ్లిన విల్లంబులతో దాడికి పాల్పడ్డాడు. దీంతో సుగ్గిరెడ్డి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతిచెంది న వ్యక్తికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ, ఎస్‌ఐ సాదిక్, గుర్తేడు ఎస్‌ఐ పార్థసారధి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్‌కు వెళ్లి చిరకాల మిత్రులు మృతి

హైవేపై అతి వేగంగా ఢీకొన్న కారు

సంఘటనా స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు మరణం


మరణించిన హనుమంతు, సురేష్ (ఫైల్)

పెరవలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా జాతీయ రహదారి అన్నవరప్పాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా పిట్ల వేమవరానికి చెందిన మాకా సురేష్(26), నేతల హనుమంతు (26) ఇద్దరు చిరకాల మిత్రులు. ఎక్కడికి వెళ్లినా కలిసి మెలిసి తిరిగేవారు. అలాగే కూలీ పనులకు వెళ్తూ తమ కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండే వారు. ఈ క్రమంలో వారు సోమవారం ఉదయం చికెన్ కోసం అన్నవరప్పాడు సెంటర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తున్న మారుతీ కారు అతి వేగంగా వచ్చి వారి మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమంతును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వాట్సాప్‌లో స్టేటస్ పెట్టి...
గోదావరిలో దూకి ఆత్మహత్య


చాణక్య (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధిని తట్టుకోలేక ఓ వ్యక్తి కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన కోడిగుడ్ల వ్యాపారి కలివరపు చాణక్య (36) కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. చిన్నతనం నుంచి (బై పోలార్) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం చాణక్య తన యాక్సిస్ బండిపై ఇంటి నుంచి బయటకువచ్చాడు. రోడ్డు కం రైలు బ్రిడ్జిపైకి చేరుకుని తన మొబైల్ వాట్సాప్‌లో మానసిక వ్యాధిని తట్టుకోలేక గోదావరిలో దూకి చనిపోతున్నానని స్టేటస్ పెట్టుకున్నాడు. స్టేటస్‌ను భార్య చూసి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. చాణక్య సోదరుడు సురేష్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ విశ్వం మిస్సింగ్ కేసునమోదు చేశారు. అనంతరం సురేష్ తన భార్య వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం వెళ్తూ రోడ్డు కం రైలు బ్రిడ్జిపై చాణక్య యాక్సిస్ బండిని చూసి తన అన్నయ్య శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. దీంతో గోదావరి నది లో గాలింపు చర్యలు చేపట్టగా రోడ్డు కం రైలు బ్రిడ్జి దిగువన ఎరినమ్మఘాట్‌లో చాణక్య మృతదేహాన్ని గుర్తించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. చాణక్యకు భార్య బేబి సరోజిని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.


మృతదేహం

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం




సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీ స్టేషన్ పరిధి అనపర్తి-బిక్కవోలు రైల్వే ట్రాక్‌పై సోమవారం గుర్తు తెలియని సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే ట్రాక్ మెన్ కొండబాబు అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహంపై ఆలీవ్ గ్రీన్ రంగు ప్యాంటు, తెలుపు, కాఫీ రంగు డిజైన్ కలిగిన చొక్కా ఉన్నట్టు పోలీసులు చెప్పారు. గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసు హెడ్‌కానిస్టేబుల్ జీ.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సోమవారం రాత్రి తెలిపారు.

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేస్తున్న సమయంలో మహిళకు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన జక్కంశెట్టి విశాలాక్షి (73) ఉపాధి పనులు చేస్తుంది. సోమవారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోగా పక్కన ఉన్న కూలీలు సపర్యలు చేశారు. అప్పటికే ఆమె మృతిచెందడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకునివెళ్లారు. మృతదేహానికి ఏపీవో అడపా వెంకట శ్రీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్ ఫీల్డ్‌అసిస్టెంట్ గంగాధర్ నివాళులర్పించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కనే జీవిస్తూ అక్కడక్కడే తిరుగుతున్న మతిస్థిమితం లేని మహిళ గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద సోమవారం తెల్లవారుజామున ఆ మహిళను గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొంది. దీంతో ఆమె విగతజీవిగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి కేసు నమోదు చేశారు. ఈ మహిళ వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కె.చిరంజీవి కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని చెప్పారు.


చినలంక వద్ద మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పురుగుల మాంసం విక్రయించినందుకు
సామర్లకోటలో చికెన్ దుకాణం సీజ్

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



కోడిమాంసం విక్రయించిన చికెన్ దుకాణం

సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పురుగులతో కూడిన నిల్వ ఉన్న కోడిమాంసం విక్రయించిన కాకినాడ జిల్లాలోని సామర్లకోట సంతమార్కెట్ వద్ద ఉన్న సూపర్ చికెన్ సెంటర్ దుకాణాన్ని మూసివేయాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆదేశించారు. ఆదివారం పురుగులతో ఉన్న కోడిమాంసాన్ని విక్రయించినట్టు కొనుగోలుదారులు చేసిన ఫిర్యాదుల మేరకు ఆంధ్రజ్యోతిలో వాస్తవ కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సామర్లకోట మున్సిపల్ అధికారులను ఆరా తీయడమే కాకుండా సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో నేరుగా కోడిమాంసం విక్రయించిన సంత మార్కెట్ రామాలయం పక్కనే ఉన్న సూపర్ చికెన్ సెంటర్‌కు మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య తనిఖీలు నిర్వహించారు. చికెన్ విక్రయాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని, హైజెనిక్ పద్ధతులు పాటించకపోవడాన్ని కమిషనర్ గుర్తించారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ పరిశీలించారు. రోజుకు ఎంత పరిమాణంలో కోడిమాంసం, మేకమాంసం విక్రయాలు సాగిస్తారో తెలుసుకున్నారు. చికెన్ దుకాణంలో పూర్తిస్థాయి హైజెనిక్ పద్ధతులు పాటించిన తర్వాత తమ సిబ్బంది పరిశీలన చేసిన అనంతరం మాత్రమే విక్రయాలు సాగించాలని, అంతవరకూ దుకాణాన్ని మూసి వేయాలని ఆమె తెలిపారు. ఆదేశాలు ఉల్లంఘించి అక్రమంగా విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ మేస్త్రీ గూడుపు శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, సిబ్బంది

భార్య, ఆమె కుటుంబీకులపై హత్యాయత్నానికి పాల్పడ్డ భర్త అరెస్ట్

అమలాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భార్యతో పాటు ఆమె కుటుంబీకులపై హత్యాయత్నానికి పాల్పడ్డ భర్తను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. వివరాల ప్రకారం... ఈ నెల 22న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఉప్పర్ల కాలనీలో నివాసముంటున్న వేముల బాల, ఆమె కుటుంబ సభ్యులపై భర్త అయిన ప్రసాద్ విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఇంట్లో అవసరాలు పట్టించుకోకుండా బాధ్యత లేకుండా తాగి తిరుగుతున్నాడని భార్య బాల ప్రశ్నించడంతో పాటు మోటారుసైకిల్ ఈఎంఐల కోసం సొమ్ములివ్వాలని అడిగినందుకు చెక్కబద్దతో ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డుపడిన అత్తమామలు, మరదలిని తీవ్రంగా గాయపరిచాడు. ఈ కేసులో వేముల ప్రసాద్‌ను దర్యాప్తు అధికారి అయిన ఎస్‌ఐ టి.శ్రీనివాస్ అరెస్టుచేసి హత్యాయత్నానికి ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరుచగా రిమాండు విధించినట్టు తెలిపారు.

ఈత సరే.. గీత దాటొద్దు!

విద్యార్థులు, చిన్నారులకు ఈత కొట్టడం అంటే ఓ సరదా. కానీ అనుకోని ప్రమాదం జరి గితే ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది. కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం, జీ.మేడపాడు గ్రామాల వద్ద గోదావరి కాలువ వెంబడి మధ్యాహ్న సమయంలో విద్యార్థులు ఈతకొడుతూ కనిపించారు. ఇది చూడడానికి సరదాగా ఉన్నప్పటికీ నీరు లోతుగా ఉండడం, తూటుకాడ, గుర్రపుడెక్క ఎక్కువగా ఉండడంతో ఒకింత లోపలికి వెళితే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపో లేదు. ఇక్కడే కాదు అనేక చోట్ల ఇలాంటి పరిస్థితి లేకపోలేదు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో కాలువలో ఈతకొట్టేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారుల మృతి చెందారు. ఇప్పుడు అసలే వేసవికాలం. అందువల్ల తల్లితండ్రులు జాగ్రత్త లు తీసుకుని లోతైన కాలువలు, చెరువుల్లోకి పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)


సామర్లకోట మండలం వేట్లపాలెం గోదావరి కాలువలో ఈతకొడుతున్న చిన్నారులు

రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో
కోనసీమ కలెక్టరేట్ జట్టు విన్నర్


విజేతగా నిలిచిన కలెక్టరేట్ బృందానికి షీల్డు అందజేసిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో కలెక్టరేట్ జట్టు విన్నర్‌గాను, అమలాపురం రెవెన్యూ డివిజన్ బృందం జట్టు రన్నర్‌గాను నిలిచినట్టు కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుల పర్యవేక్షణలో జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించినట్టు తెలిపారు. విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన జట్లకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి షీల్డులు అందజేశారు. క్రీడా పోటీలకు వ్యాఖ్యాతగా ఎస్పీ భరత్ వ్యవహరించారు. రెవెన్యూ ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని అధిగమించి మానసిక ఉల్లాసాన్ని పొందేందుకు క్రీడలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ బృందానికి కెప్టెన్‌గా కిశోర్, అమలాపురం డివిజన్ జట్టుకు కెప్టెన్‌గా శివ వ్యవహరించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కిరణ్, బెస్ట్ బౌలర్‌గా కృపాపాల్ నిలిచారు. విన్నర్స్ బృందంలో కిరణ్, శేషు, సుధీర్‌కుమార్, రన్నర్స్ జట్టులో శివ, యాకుబ్, కల్యాణ్‌లు అద్భుత ప్రతిభ చాటారు.

సత్యదేవుని సన్నిధిలో నీటిని వృథా చేయొద్దు

» పంపా రిజర్వాయర్‌లోకి ఏలేరు నీరు చేరేలా చర్యలు

» పోలవరం, ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో కాకినాడ జిల్లా కలెక్టర్ సమీక్ష

అన్నవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో నీరు వృథా కాకుండా చూడాలని, కనీసం రోజుకు 2లక్షల లీటర్ల నీటిని పొదుపుచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. పోలవరం పనుల కారణంగా పంపా రిజర్వాయర్‌లో నీరు నిల్వలేకపోవడం, ప్రస్తుతం ఎండల కారణంగా ఉన్ననీరు ఆరించిపోవడంతో సత్రం గదుల్లో బస చేసే భక్తులకు నీటిసౌకర్యం కల్పించే విషయంలో ఇబ్బందులు మరోపక్క శ్రీరామనవమి, స్వామివారి దివ్యకల్యాణోత్సవాల్లో చక్రస్నానం కార్యక్రమాల నీటి అవసరాలపై సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో పోలవరం, ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏలేరు నీటిని పోలవరం ప్రాజెక్ట్ పనులకు ఆటంకం కలగకుండా పైప్‌లైన్ వేసేందుకు సుమారు రూ.22లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేసి ఆ నిధులను ఇప్పించాలని కలెక్టర్‌ను కోరడంతో ఆయన అంగీకరించారు. అయితే ఏప్రిల్ 15 నుంచి ఏలేరు రిజర్వాయర్ నీటిని పంపాలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏలేరు నీరు వచ్చే కాలువవెంబడి పంటలు ఉంటే రోజుకు 25 క్యూసెక్కుల చొప్పున నెలరోజులు పంటలు లేకుంటే 50 క్యూసెక్కులు చొప్పున 15 రోజుల పాటు నీటిని అందిస్తే వేసవి నుంచి భక్తులు గట్టెక్కించవచ్చని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలపడంతో ఆవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఉన్న నీటినిల్వలు భక్తుల అవసరాలకు పొదుపుగా వాడుకుంటే నెలరోజులకు సరిపోతాయని ఇరిగేషన్ ఈఈ తెలిపారు. సమావేశంలో దేవస్థానం ఈవో సుబ్బారావు, ఈఈ నూకరత్నం, డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు మేరీమాత మహోత్సవాలు


నిర్మలగిరిలో ప్రార్థనలు చేస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో గౌరీపట్నం మేరీమాత మహోత్సవాలకు మూడో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. పుణ్యక్షేత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు దివ్య బలిపూజలు చేశారు. ఆయన ప్రసంగిస్తూ సకాల మానవాళి సుఖ శాంతులతో జీవించాలని, అందరూ దైవచింతన కలిగి ఉండాలన్నారు. ఉదయం రెవరెండ్ ఫాదర్ దానియేలు, మేత్రాసన నూతన గురువులు మరియజోజి, బాలరాజు, సాగర్, దివ్య బలి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సువార్త కమిటీ గాబ్రియేలు సువార్త ప్రచారం నిర్వహించారు. గొరంట్ల జ్వానేస్, బాబుజార్జి, టీ.ఇమ్మానియేలు, కే.రాయప్ప, పరిశుద్ధ జపమాల, దివ్య బలి పూజలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్మల స్కూల్ బాల బాలి కలతో నృత్యప్రదర్శన, కే.జ్ఞానానందం సంగీ తకచేరి, ఏసుమహిమ నాటకాలు ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు మేరీ మాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


విద్యుత్ కాంతుల్లో జీసెస్ టవర్

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీలో జరిగిన తల్లీకూతురి హత్య కేసులో నిందితుడు పల్లి శివకుమార్‌ను అరెస్టు చేసినట్టు ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో లైట్ మెన్‌గా పనిచేస్తూ పరిచయమైన శ్రీకాకుళం జిల్లా కొత్తవీధి నందిగామ మండలానికి చెందిన శివకుమార్, సుమ్యా ప్రేమించుకున్నారు. తండ్రి మరణించడంతో తల్లి సాల్మాతో కలిసి రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీలోకి 3నెలల క్రితం సుమ్యా వచ్చి ఇక్కడే ఉంటోంది. కొంతకాలంగా శివకుమార్ వచ్చి వెళ్తున్నాడు. ఇటీవల సుమ్యా వేరొకరితో ఫోన్లో మాట్లాడడాన్ని గమనించిన శివకుమార్ నామవరం వచ్చి ఆదివారం రాత్రి తల్లి సాల్మాను నిలదీశాడు. సుమ్యాను సాల్మానే ప్రోత్సహిస్తుందని ఆమెతో గొడవపడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున ఫోను మాట్లాడేందుకు సుమ్యా మేడపైకి వెళ్లిన సమయంలో వారి వంట గదిలో ఉన్న కత్తిని తీసుకుని మంచంపై పడుకున్న సాల్మా గొంతుకోసి ఆటుపై తలుపు పక్కనే వేచి ఉంచి సుమ్యా లోపలికి వచ్చే క్రమంలో ఆమెపై దాడి చేసి హత్య చేశాడు. ఆపై అక్కడి నుంచి పరారయ్యాడు. కొవ్వూరు రూరల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. సోమవారం నిందితుడిని కొవ్వూరు నుంచి తీసుకువచ్చి అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో పక్క సాల్మా, సుమ్యా మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరికి 11నెలలు జైలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు 11నెలల జైలు శిక్ష విధిస్తూ ఐదో అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి తీర్పునిచ్చారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సారంగధర మెట్టకు చెందిన కోసూరి వెంకటరమణ, సుబ్బారావు నగర్‌కు చెందిన ఎంపల్లి లక్ష్మణరావు 2024లో రాజమహేంద్రవరంలో దహించు అగ్ని ప్రార్థనా మందిరం వద్ద బైక్‌లను దొంగించారని బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి త్రీటౌన్ ఎస్‌ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. ప్రాసెక్యూషన్ తరఫున అసిస్టెంట్ ఏపీపీ బీవీ మోహనరావు వాదించారు. ఈ కేసులో ట్రైల్ ప్రాసెస్‌కి ఎప్పటికిప్పుడు మోనిటర్ చేసిన ప్రస్తుత త్రీటౌన్ సీఐ వి.అప్పారావును, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఎన్.వెంకటేశ్వరావులను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

బీజేపీ నేతపై కర్రతో దాడి

రౌతులపూడి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన మండల బీజేపీ నేత యారగాని వెంకట రమణ(శ్రీను)పై అదే గ్రామానికి చెందిన గాలి అప్పారావు దాడి చేశాడు. సోమవారం శ్రీను తన ఇంటి వద్ద నుంచి శివాలయానికి బైక్‌పై వెళ్తుండగా అప్పారావు కర్రతో దాడి చేశాడు. గతంలో రహదారికి అడ్డంగా ఇసుక, కంకర పోశాడు, పక్కకు తొలగించాలని ప్రశ్నించినందుకు కక్ష పెంచుకుని దాడి చేశాడని, అప్పారావు వల్ల తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

ఎండ మండే.. మబ్బు హాయే..

ఎండలు మండిపోతున్నప్పుడు మబ్బు పడితే ఎంతో హాయిగా ఉంటుంది కదా.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఇదే జరిగింది. ఆ దృశ్యాలే ఇవి.



- ఫొటోగ్రాఫర్ రాజమహేంద్రవరం

ప్రతి మహిళ పారిశ్రామికవేత్త కావాలి



మహిళలకు చెక్‌లు అందిస్తున్న రాజోలు ఎమ్మెల్యే

రాజోలు ఎమ్మెల్యే దేవ

మలికిపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా నిలదొక్కుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా 13 మంది ఎస్సీ మహిళలకు మంజూరైన చెక్‌లను ఆయన అందించారు. సోమవారం విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే వాటి ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, మంగెన భూదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ జిల్లా అధికారి ప్రసాద్

ముమ్మిడివరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల జిల్లా అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. ముమ్మిడివరం అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని బ్యాంకు నుంచి రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు నుంచి రుణాలు ఎలా రుణాలు పొందాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా అధికారిణి మాధురి, కోఆర్డినేటర్ వెంకట్, ఎంఎస్ఎఫ్ఈ ఫ్యాకల్టీ గణేష్, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు



స్థలాన్ని పరిశీలిస్తున్న అమలాపురం ఆర్డీవో మాధవి

ఆర్డీవో స్థల పరిశీలన

ముమ్మిడివరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రూ.161.56 కోట్లు మంజూరు చేసింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కృషితో నిధులు మంజూరయ్యాయి. దీంతో మంచినీటి ప్రాజెక్టు నిర్మాణం, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి వాటిని నిర్మించాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి నిధులు మంజూరయ్యాయి. దీంతో నగర పంచాయతీ స్థలం సేకరణకు సంబంధించి రెవెన్యూశాఖను కోరడంతో అమలాపురం ఆర్డీవో కె.మాధవి సోమవారం ముమ్మిడివరం నగర పంచాయతీ 20వ వార్డు మట్టాడిపాలెంలోని గతంలో ప్రభుత్వం సేకరించిన స్థలాన్ని పరిశీలించారు. స్థలం మంజూరుకు సంబంధించిన ప్రతిపాదన రూపొందించి నివేదించాల్సిందిగా తహశీల్దార్ ఎంవీఎస్ లక్ష్మిని ఆదేశించారు. స్థలం సేకరణకు సంబంధించిన విషయాలను మంచినీటి ప్రాజెక్టు, విద్యుత్ సబ్‌స్టేషన్ వివరాలను ఆర్డీవో కె.మాధవి కమిషనర్ పి.రవివర్మతో చర్చించారు. వారి వెంట ఏఈ పీవీ సుధాకర్, డీటీ బి.గోపాలకృష్ణ, టీపీవో రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. విద్యుత్ ప్రమాదంలో మరణించిన పశువుల్లంకకు చెందిన మార్త విజయకుమార్ భార్య రత్న కుమారికి మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన రూ.15 లక్షల పోస్టల్ బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్, పేమెంట్స్ బ్యాంకు మేనేజర్ కలపాల రాజ్‌కుమార్, మేనేజర్ బాలాజీ, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వంశీ, మాగాపు బాబ్జీతో పాటు నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, సఖిలే రాజు, ముదునూరి రామలింగరాజు పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్ర పర్యటన విజయవంతం

ముమ్మిడివరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శాస్త్ర విజ్ఞానయాత్ర విజయవంతంగా ముగిసినట్టు సైన్స్ జిల్లా అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లాలో 6 నుంచి 9 తరగతుల వరకు గల సైన్స్ ఈవెంట్‌లో పాల్గొన్న 116 మంది విద్యార్థులు 15 మంది గైడ్ టీచర్లతో మూడు రోజుల పాటు యాత్రను నిర్వహించామన్నారు. విద్యార్థుల పర్యటనపై పుస్తకల రూపంలో వారు నిర్వహించిన పరిశోధనలు, గమనికలను రూపొందించి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు నివేదించనున్నట్టు జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా అకడమిక్ మోనటరింగ్ బి.రాంబాబు, మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాస్‌గౌడ్, గైడ్ టీచర్లు ఎంతో ప్రాముఖ్యత వహించారన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై వార్షిక ప్రణాళిక

మలికిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరుగు కన్జర్వెన్సీలో భాగంగా వ్యవసాయశాఖ, ఎన్ఆర్ఈజీఎస్, డీఆర్డీఏ శాఖలు సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక 2025-26 గురించి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో చర్చించారు. 365 రోజులు విత్తనాలతో భూమిని కప్పి ఉంచే పద్ధతిలో భూమికి పోషకాలు అందించుట, వాతావరణంలో వచ్చే మార్పులు అరికట్టుట, భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుటకు సూర్యుడి నుంచి వచ్చే వేడి వల్ల భూమిలో నీరు, ఆవిరి శాతం అరికట్టుట కోసం భూసారం పెంచి దిగుబడులు పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఎమ్మెల్యేకు వివరించారు. మహిళా సంఘాలు, రైతుల సహకారంతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యేను కలిసి వివరించిన వారిలో వ్యవసాయ సిబ్బంది డీపీఎం సత్యనారాయణ, ఎంటీ జోసెఫ్, ఎం.శ్రీనివాసరావు, పి.ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

పనివేళల్లో అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల పనివేళల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ పి.నాగలక్ష్మి పేర్కొన్నారు. జిల్లాలోని కర్మాగారాలు, వివిధ రకాల దుకాణాలు పనిచేసే కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తపై పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు కార్మికుల పనివేళల్లో మార్పులు చేయాలని నాగలక్ష్మి కోరారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంచేందుకే స్కౌట్ అండ్ గైడ్స్

కాట్రేనికోన, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో స్కౌట్ అండ్ గైడ్స్ దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందిస్తుందని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. శ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో సోమవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్స్ శిక్షణను ఆయన ప్రారంభించారు. 26 పీఎంశ్రీ పాఠశాలల నుంచి 186 మంది విద్యార్థులు ఈ శిక్షణలో ఉన్నట్టు సమగ్రశిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్కౌట్ అండ్ గైడ్ పతాకాన్ని డీఈవో ఆవిష్కరించారు. స్కౌట్ టీచర్స్ లీడర్ ఆఫ్ ట్రైనింగ్ ఎం.హరీష్ కుమార్, గైడ్ కెప్టెన్ లీడర్ ఆఫ్ ట్రైనింగ్ సుగుణారాజేంద్రన్, అసిస్టెంట్ లీడర్ ఆఫ్ ట్రైనీ సుబ్బ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు వినియోగించరాదు

అమలాపురం టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్ జవాబు పత్రాల వాల్యుయేషన్ చేసే అధ్యాపకులు సెల్‌ఫోన్లు వినియోగించరాదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు పేర్కొన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం చీఫ్ ఎగ్జామినర్స్ అసిస్టెంట్ ఎగ్జామినర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు జాగ్రత్తలు తెలిపారు. చరిత్ర, రసాయనశాస్త్రం సబ్జెక్టుల జవాబు పత్రాలను దిద్దడం ప్రారంభించామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు పి.కర్ణారావు, వి.నాగలక్ష్మి, అడబాల శ్రీనివాస్, వై.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలకు చెక్కుల అందజేత

అంతర్వేది, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఉన్న ఎస్సీ మహిళలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతులమీదుగా చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ప్రధానమంత్రి అజయ్ ప్రోగాం కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల ఎస్సీ మహిళలకు చెక్కులు అందజేశారు. మోరిపోడు గ్రామంలో 14 మందికి రూ.లక్ష చొప్పున చెక్కు అందించినట్టు మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని తెలిపారు. కార్యక్రమంలో చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, తాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అమలాపురం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ బబీఎస్ నారాయణపై విధించి అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో చేపట్టి రిలే దీక్షలు సోమవారం నాటికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో బి.త్రిమూర్తులు, బీఎస్ బాబు, వీఎస్ రావు, బీపీ కుమార్, డి.కుమారి, ఎ.రమేష్, జీఎంకేపీ స్వామి, ఎంఎస్ఆర్ కుమార్, కేపీఎస్ కుమారి, వీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

మామిడికుదురు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ రుణాలకు దరఖాస్తుల చివరి తేది 25వ తేదీ అన్నారు. ఇప్పటి వరకు 1500 మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హులు మంగళవారం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్షయవ్యాధిని సమాజం నుంచి తరిమేద్దాం



కలెక్టరేట్‌లో క్షయవ్యాధి నివారణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సమాజం నుంచి క్షయవ్యాధికి చరమగీతం పాడాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలుత ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో బ్యాక్టీరియా గాలి ద్వారా ఊపిరితిత్తులకు సోకడంతో కలిగే ప్రమాదమైన అంటువ్యాధి అన్నారు. క్షయ వ్యాధి నివారణకు జిల్లాలో ఏడు ట్రీట్మెంట్ యూనిట్లు, 23 నాట్ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ ఏడాది 11,677 అనుమానిత కేసులను పరీక్షించి 233 మందికి క్షయవ్యాధి ఉన్నట్టు గుర్తించామన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే క్షయవ్యాధి నివారణ సాధ్యమేనన్నారు. అనంతరం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో క్షయవ్యాధి జిల్లా నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డాక్టర్ సుమలత, కోఆర్డినేటర్ జాన్‌లేవీ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వీరవల్లిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పి.విజయ్, సూపర్‌వైజర్ ఎం.రామారావు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ బి.సాయిశ్రుతి మాట్లాడారు. ఈ సందర్భంగా ర్యాలీ జరిపారు. టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది అంటూ నినాదాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి హైస్కూలు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ బి.సాయిశ్రుతి, వైద్యులు, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, రాజేశ్వరి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన సదస్సు: ముమ్మిడివరంలో క్షయవ్యాధి నిర్మూలనపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి హైస్కూలు సెంటర్ వరకు ర్యాలీ జరిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూజ, సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, ఫార్మాసిస్ట్ ఎస్వీవీ సత్యనారాయణ, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామంటూ నగరం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా ర్యాలీ జరిపి వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. దగ్గు సంబంధిత లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యవతి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. టీబీ ఓడిపోతుంది-దేశం గెలుస్తుందని నినాదాలు చేస్తూ ప్రధాన రహదారిపై మానవహారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వైవీ ప్రియాంక, ఎంపీహెచ్‌ఇవో ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్‌లు బీవీవీఎస్ఎన్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్లింలకు పవిత్ర గ్రంథం ఖురాన్

ముమ్మిడివరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు పవిత్ర గ్రంథం ఖురాన్ అని విశాఖకు చెందిన మతగురువు షేక్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం ముమ్మిడివరంలోని తెలుగుదేశం కార్యాలయంలో జమియత్ అహ్లే హదీస్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ముస్లింల ధార్మిక సభ జిల్లా జమియత్ అహ్లే అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన సభలో మతగురువు షేక్ షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, షేక్ అబ్దుల్లా తదితరులతో పాటు ముస్లింలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి నిదర్శనం రంజాన్

మామిడికుదురు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలో సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మోల్లేటి శ్రీనివాస్, బోనం బాబు తదితరులతో పాటు పలువురు ముస్లిం పెద్దలు అబెద్‌అలీ, ఎంకె రజా (రజ్వీ) తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ నిషాంతి

మత్స్యకారుల బోట్లకు ట్రాన్స్‌పాండర్స్ బిగిస్తే మేలు

అమలాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల బోట్లకు ట్రాన్స్‌పాండర్స్ బిగిస్తే మేలు చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి మత్స్యకార కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సముద్ర తీరానికి 200 మీటర్ల పరిధిలో ఉన్న చెరువులన్నింటినీ తొలగించాలన్నారు. తుమ్మలపల్లి ఆక్వా చెరువులు సమస్యలపై కమిటీ సభ్యులతో చర్చించారు. జిల్లా కమిటీ సభ్యులైన జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, ఎల్డీఎం కేశవవర్మ, పరిశ్రమల కేంద్రం జిల్లా సహాయ సంచాలకుడు శివరామప్రసాద్, జలవనరులశాఖ ఈఈ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరంను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి

అల్లవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం-సామంతకుర్రు పరిధిలోని ఎన్.రామేశ్వరం అగ్నికుల క్షత్రియుల గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అగ్నికుల క్షత్రియ కుటుంబాలు అధికంగా కలిగిన నక్కా రామేశ్వరం గ్రామానికి ప్రత్యేక పంచాయతీ హోదా కల్పించాలని వినతిపత్రం అందించారు. అంగాని శ్రీనివాస్, చెక్కా సత్తిబాబు తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న రామేశ్వరం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కట్టా నారాయణమూర్తి, అంగాని ధనుంజయవర్మ, జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారికి వినతిపత్రం ఇచ్చారు.

కొబ్బరి తోటలకు నష్టంపై ఫిర్యాదు

అల్లవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంట్ చుట్టూ డ్రైనేజీ సదుపాయం లేక ముంపు నీరు దిగక కొబ్బరి తోటలు చనిపోయినందున ఓఎన్జీసీ ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు 34 మంది రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఓఎన్జీసీ కెమికల్‌తో కూడిన నీటిని తమ పొలాల్లోకి దించేస్తున్నారని, రూ.12 కోట్లతో ఓఎన్జీసీ గతంలో ఏర్పాటు చేసిన డ్రైన్ కుప్పకూలి ముంపు దిగని ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చొల్లంగి రాధాకృష్ణ, మల్లాడి ఉమామహేశ్వరరావు, పెచ్చెట్టి నరసింహరాజు, బీనబోయిన సత్యనారాయణతో పాటు బాధిత రైతులు తమ ఇబ్బందులు ఏకరువు పెట్టారు. ఓఎన్జీసీ ద్వారా నష్టపరిహారం ఇప్పించకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం చూపితే చర్యలు



మాట్లాడుతున్న విద్యాశాఖ జిల్లా అధికారి షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను సమర్థవంతంగా పంపిణీ చేసేందుకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం పీఎంశ్రీ ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, ఐటీ సిబ్బంది, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లకు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో డీఈవో సలీంబాషా మాట్లాడారు. విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం ప్రదర్శించరాదని హెచ్చరించారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష సీఎంవో బీవీ సుబ్రహ్మణ్యం, జీసీడీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఐఈ కో-ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘కష్టపడిన వారికి పదవులు ఇవ్వాలి’



మాట్లాడుతున్న నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు

పి.గన్నవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన ద్వితీయ శ్రేణి నాయకులను గుర్తించడంతో పాటు నామినేటెడ్ పదవులు కేటాయించాలని నియోజకవర్గానికి చెం దిన పలువురు టీడీపీ నాయకులు వాపోయారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు ఆవేదనను వినిపించారు. పదవుల కేటాయింపులో కో-ఆర్డినేషన్ కమిటీ పూర్తి స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవా లని, ప్రతి విషయాన్ని పార్టీ నాయకు లతో చర్చించాల్సిన అవసరం ఉంద న్నారు. తెలుగు యువత నాయ కులు మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలని ఆదిశగా నాయకులు ఆలోచనల చేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయం మేరకు పదవులు ఉంటాయని కష్టపడిన కార్యకర్తలకు పదవులు వస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, కమిటీ కో-కన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, మద్దాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అరకొర సమాచారంతో సమావేశాలకు రావొద్దు

మండల పరిషత్ సమావేశంలో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



మాట్లాడుతున్న సర్పంచ్ నాగేశ్వరరావు

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సమావేశానికి అరకొర సమాచారంతో అధికారులు రావొద్దని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో జీవీ సరోవరరావు పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అమలాపురానికి చెందిన ఆర్టీసీ డిపో అధికారి లక్ష్మణరావు మాట్లాడుతున్న సమయంలో నందంపూడి ఎంపీటీసీ వడ్లమాని పద్మావతి ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు లేవని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు ఏపీఎం శ్రీనివాస్‌ను పలు సమస్యలపై నిలదీశారు. ఉద్యానశాఖాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కోకో పంటను విస్తరించే విధంగా రైతులు కృషి చేయాలన్నారు. కోకో పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని కోకో, వక్క కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ డి.నాగేశ్వరరావు కోరారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే రెండేళ్లలో నియోజకవర్గంలో ప్రతి రహదారిని అభివృద్ధి చేస్తానన్నారు. సమావేశంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఇన్‌చార్జ్ తహశీల్దారు వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ భీమారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొనుగుమట్లకు కవితా పురస్కారం

యానాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిసంధ్య, చిన్నినారాయణరావు, సాహితీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవిత పోటీల్లో యానాంకు చెందిన పాత్రికేయుడు, కవి పొనుగుమట్ల అశోక్ కుమార్ రచించిన కవితకు ప్రోత్సాహక బహుమతి లభించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో ఆదివారం జరిగిన ప్రపంచ కవితా దినోత్సవ సభలో సాహితీవేత్తలు డాక్టర్ ఎన్.గోపి, దర్భశయనం శ్రీనివాసాచార్య, డాక్టర్ కొప్పర్తి వెంకటరమణమూర్తి, సుధామ, కవిసంధ్య అధ్యక్షుడు డాక్టర్ శిఖామణిలు శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం, మెమెంటో అందించారు. కవులు డాక్టర్ ప్రసాద్‌మూర్తి, డాక్టర్ కె.కోటేశ్వరరావు, చిన్ని నారాయణరావు, సాహితీ ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణరావు తదితరులు పొనుగుమట్లను అభినందించారు. అనంతరం కవి సమ్మేళనంలో తన కవితను వినిపించారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బీఎస్పీ ధర్నా

అమలాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. మనువాదుల కుట్రలో భాగంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి జాన్‌మోషే ఆరోపించారు. రాజ్యాంగం మౌలిక సూత్రాలకు విరుద్ధంగా వర్గీకరణ చేపట్టడాన్ని జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీభవానీ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణను తక్షణం విరమించుకోవాలని నినాదాలు చేశారు. ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలి

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ ఆమోదంపై ఎస్సీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద మండల మాల మహానాడు అధ్యక్షులు నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ తహశీల్దారు వెంకటేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, నెల్లి వెంకటరమణ, గోసంగి సత్యనారాయణ, షైలా ఆనందరావు, ముత్తాబత్తుల ప్రశాంత్, గోసంగి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా అబ్బాయి వెంకన్న

అమలాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా జంగా అబ్బాయి వెంకన్నను నియమించారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉత్సవ కమిటీని ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు సోమవారం ప్రకటించారు. కమిటీ సభ్యులుగా దున్నాల వెంకటస్వామినాయుడు, గన్నవరపు సూర్యభాస్కరరావు, గోకరకొండ లక్ష్మణరావు, మోకా వెంకటసుబ్బారావు, దున్నాల దుర్గారావు, కొమ్ముల ఆదినారాయణ, కుంచే వెంకన్నబాబు, అర్చకుడు పెద్దింటి బాలవెంకటలక్ష్మీనరసింహాచారిలను నియమించారు.

కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

అమలాపురం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అవిశ్రాంత పోరాటం చేసిన మహనీయుడిగా మందకృష్ణమాదిగ నిలిచిపోతారని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ పేర్కొన్నారు. కామనగరువులో సోమవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించి కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సభ్యులు మడికి శ్రీరాములు, కొరుకూరి కృపావరం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉప్పలగుప్తం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి గ్రామంలో ప్రభుత్వ నిధులు మంజూరైనా పనులు చేసేందుకు పంచాయతీ తీర్మానం ఇవ్వడానికి సర్పంచ్ నిరాకరిస్తున్నారంటూ ఎంపీటీసీతో పాటు ఏడుగురు పంచాయతీ సభ్యులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 12 పంచాయతీ సభ్యుల్లో ఏడుగురు తీర్మానానికి అనుకూలంగా ఉన్నప్పటికీ వైసీపీకి చెందిన సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి తీర్మానాన్ని సమావేశంలో పెట్టకుండా కార్యదర్శిని అడ్డుకుంటున్నారని ఆ ఫిర్యాదులో తెలిపారు. ఎంపీటీసీ సలాది సురేఖావాణితో పాటు ఉపసర్పంచ్ ఎన్ఎస్‌వీఎన్ రంగారావు, సభ్యులు ఎన్.సత్యశ్రీ, సీహెచ్ వెంకటలక్ష్మి, నందుల ఆదినారాయణ, కె.సుబ్బలక్ష్మి, కేవీవీఎన్ సత్యనారాయణ, ఎ.అనంతలక్ష్మి, టి.వీరమాత, కె.సూర్యకుమారి, నందుల గంగాభవాని, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నందుల సత్తిరాజు ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఉన్నారు.

పెళ్లి మండపాలపై ఫిర్యాదు

అంతర్వేది, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పెళ్లి మండపాలకు సంబంధించి టెండర్లను ఉపసంహరించుకోవాలని మూడు గ్రామాల సర్పంచ్‌లు వినతిపత్రం అందించారు. మధ్య తరగతి కుటుంబాలు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఖర్చులు పెరిగిపోవడంతో స్వామివారి ఆలయంలో పెళ్లిళ్లు చేసుకునేందుకు ఉచితంగా అవకాశం కల్పించాలని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఏసీని వివరణ కోరగా ప్రస్తుతం బహిరంగ టెండర్లు జరుగుతుండగా వాటిలో పెళ్లి మండపాలకు సంబంధించి దేవదాయశాఖతో చర్చించి త్వరలో తెలియచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.జాన్‌బాబు, డి.రవికుమార్, ఒడుగు శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు స్వాధీనం

పి.గన్నవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉడిమూడి గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. ఉడిమూడి లంక ప్రాంతం నుంచి రెండు ట్రాక్టర్లు మట్టిని తీసుకుని రాగా అందిన సమాచారం మేరకు దాడులు చేయగా ఒక ట్రాక్టరులోని మట్టిని అన్‌లోడ్ చేశారని మట్టితో ఉన్న మరో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

'క్షయ వ్యాధిని మనమంతా అరికడదాం'



పేకేరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

కె.గంగవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేకేరు పీహెచ్‌సీ వద్ద వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రేఖారాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ క్షయవ్యాధిని మనమంతా అరికడదామన్నారు. అలాగే రెండువారాల పాటు నిరంతరం దగ్గు, బరువు తగ్గడం, జ్వరం, నిద్రలేమి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. ఒక వేళ క్షయవ్యాధిగా నిర్ధారణ జరిగితే క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. తొలుత వైద్యసిబ్బంది, గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు వెలిశెట్టి శ్యామలరావు, వైద్యఆరోగ్య సిబ్బంది వీవీవీఎస్ మూర్తి, పీబీఏ రాజశేఖర్, వి.మంగాదేవి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆక్వా జోనేషన్ రీసర్వే ప్రారంభం

రాయవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 26, 27 తేదీల్లో ఆక్వాజోనేషన్ రీసర్వేను ప్రారంభిస్తున్నట్టు ద్వారపూడి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి విళ్ల రమణరావు తెలిపారు. సోమవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జీవో ఎంఎస్ 16 నిబంధలను అనుసరించి రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ముంపునకు గురయ్యే భూములు, వ్యవసాయానికి అనువుగా లేని భూముల్లో చెరువుల తవ్వకాలు జరిపేందుకు జరిపేందుకు ముందుగా ఆక్వా జోనేషన్ సర్వేలో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దీనికోసం రామచంద్రపురం డివిజన్ పరిధిలో రాయవరం మండలంలో వివిధ గ్రామాల్లో ఆయా సచివాలయాల పరిధిలో గ్రామస్థాయి కమిటీలతో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈసభల ద్వారా ఇప్పటికే ఆక్వాజోన్ పరిధిలో ఉన్న భూముల వివరాలు సరి చేసుకునేందుకు, కొత్తగా జోన్ పరిధిలో భూముల వివరాలు నమోదుకు గ్రామసభలు దోహదపడతాయన్నారు. ఆక్వా జోన్ విధానంతో సాగు చేసే విస్తీర్ణం, రైతుల వివరాల జాబితాను గ్రామస్థాయి కమిటీల ద్వారా జిల్లా స్థాయి కమిటీలకు పంపుతామన్నారు. ఈనెల 26న కూర్మాపురం, మాచవరం, వెంటూరు పరిధిలో, 27న నదురుబాద, వెదురుపాక, వి.సావరం, సోమేశ్వరంలో గ్రామసభలు జరుగుతాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రాంబాబు

రాయవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, విద్యార్థులంతా విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని పలువురు వక్తలు సూచించారు. సోమవారం రాయవరం విజ్ఞాన్ కళాశాలలో ఫైర్‌వెల్ డే వేడుకలను విజ్ఞాన్, వీఎస్ఆర్ కళాశాలల అధినేత డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి, శేషవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికబద్ధంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చదువు, ఆటపాటల్లో రాణించిన విద్యార్థులకు అమ్మిరెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, కర్రి భానురేఖ, సందీప్‌రెడ్డి, విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ అచ్చిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్‌రెడ్డి, పీవీ పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిల విడుదలపై హర్షం

కె.గంగవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బకాయిని విడుదల చేయడంపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల కృష్ణకుమార్, డి.సురేష్‌బాబు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. కె.గంగవరంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఏపీ జీఎల్ఐ, పీఎఫ్ బకాయిల విడుదల హర్షణీయమన్నారు.

త్వరలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు : ఎమ్మెల్యే



మండపేటలో టిడ్కో గృహాల సముదాయం (ఫైల్)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మండపేట, మార్చి24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేగుళ్లవీర్రాజునగర్ (గొల్లపుంత కాలనీలో) టిడ్కో గృహల నిర్మాణాలు పూర్తి చేసి, త్వరలో లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ 2019 నాటికే 95శాతం మేర పనులు పూర్తయ్యాయని, మొత్తం 6,128 గృహాలు నిర్మించగా, అందులో ఇప్పటివరకు 2,565 మందికి ఇళ్లను నిర్మించి అప్పగించడం జరిగిందన్నారు. అయితే ఇంకా 3,563 మందికి ప్లాట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. 95 శాతం పూర్తయిన పనులు, మరో 5 శాతం పూర్తిచేయటంలో టిడ్కో, మున్సిపల్ శాఖాధికా రులు నిర్లక్ష్యం వహించడం వల్లే లబ్ధిదారులకు అందించడంలో జాప్యం జరుగుతుందని ఆరో పించారు. ఈ నేపథ్యంలో టిడ్కో పనులు పూర్తి చేసి, లబ్ధిదారులకి అప్పగించే వరకు మున్సిపల్ కార్యాలయాన్ని టిడ్కో అపార్ట్‌మెంట్ వద్దకు తరలించాల్సిందిగా ఆయన మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావును ఆదేశించారు. ఇక్కడి గృహాల విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని త్వరలో లబ్ధిదారులకు ఇచ్చేలా కార్యాచరణ చేపట్టి అధికారులను సమాయత్తం చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలని పలువురు అంటున్నారు.

పసలపూడిలో ఘనంగా వీరభద్రుడి సంబరం



గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పసలపూడిలో వీరభద్రుడి సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం, దశమిని పురస్కరించుకుని కేసన కుర్తి సావిత్రి, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద పూజలు, హారతులు నిర్వహించిన మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందినవారు సుమారు 600 మంది పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు రాట ముహూర్తం



సీతారామక్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు రాట వేస్తున్న దృశ్యం

మండపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూరుగుంట రామాలయం వద్ద గల సీతారామక్షేత్రంలో ఆలయ 8 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయ ట్రస్టు సభ్యులు రాట ముహూర్తం చేశారు. శ్రీరామనవమి ఉత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాటను ఆలయ అర్చకులు వరదాచార్యుల సారథ్యంలో వేశారు. ముందు స్వామివారికి విశేషపూజలు అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టీ మల్లిపూడి గణేష్, కొండ, బొబ్బిలిరాజు, మల్లిపూడి కొండయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

రాయవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పసలపూడి సాయిబాబా ఆలయ 31వ వార్షికోత్సవ పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ఉంచి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

క్షయవ్యాధిని నివారించడమే ప్రభుత్వ లక్ష్యం



వాకతిప్పలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కపిలేశ్వరపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : మన దేశంలో 2025 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి డా. రాకేష్‌చౌదరి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంపీహెచ్ఈవోలు జె. మల్లికార్జునుడు, బిషప్, టి.బి సూపర్‌వైజర్ రమణ, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, హెచ్ఈ రామారావు, హెచ్ వీ మేరీమణి, ల్యాబ్‌టెక్నీషియన్ ఆలీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గండిప్రసాద్‌కు జాతీయ సాహిత్య పురస్కారం



పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

మండపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గండిస్వామిప్రసాద్ ద్వారపూడి చెరుకూరి కాశీ విశ్వనాథ రాజు జిల్లా పరిషత్ హైస్కూల్లో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈయన ప్రగతి నిరోధక శక్తులను వణికించిన బోయిభీమన్న రచనలు పేరిట సమర్పించిన రచనకు ఉత్తమ పరిశోధానాంశంగా ఎంపికైంది. ఈమేరకు ఆదికవి నన్నయ్య వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ చేతుల మీదుగా ప్రసాద్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు. ద్వారపూడి హైస్కూల్ హెచ్ఎం సుబ్రహ్మణ్యం, అభ్యుదయ రచయితల సంఘం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అభినందించారు.

బారికేడ్ల బహూకరణ

రాయవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాయవరం పోలీస్‌స్టేషన్‌కు సోమవారం దాత వితరణతో బారికేడ్లను బహూ కరించారు. సాయితేజా స్కూల్ అకడమిక్ డైరెక్టర్లు కర్రి భానురేఖ, సందీప్‌రెడ్డి దంపతుల వితరణతో నాలుగు బారికేడ్లను తయారు చేయించి ఎస్ఐ డి.సురేష్‌బాబుకు అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వేగంగా ప్రయాణించే వాహనాల నియంత్రణకు ఇవి ఉపయోగపడతాయన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు , తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందక పొలాలు ఎండడానికి వీల్లేదు

» నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

» ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులతో సమావేశంలో మంత్రి సుభాష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ),మార్చి24(ఆంధ్రజ్యోతి): వరి పొలాలు ఈనిక దశలో ఉన్నాయని, నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, ఏ ఒక్క ఎకరం సాగునీరందక ఎండడానికి వీల్లేదని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రామచంద్రపురంలోని లయన్స్ కల్యాణ మండపంలో నీటిపారుదల, పారిశుధ్య అధికారులు, రైతులు, నీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరందేలా అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సాగునీరందని ప్రాంతాలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, డ్రైనేజీ శాఖ డీఈ పోచారావు, నీటి పంపిణీ సంస్థలు కాజులూరు, రామచంద్రపురం, యర్రపోతవరం, కోటిపల్లి అధ్యక్షులు ఎల్.కృష్ణచైతన్య, ఎం.సత్యనారాయణరెడ్డి, ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, విజయరామరాజు, గరిగిపాటి సూర్యనారాయణమూర్తి పా ల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక కాపు కల్యాణ మండపంలో మండపేటకు చెందిన నారాయణరెడ్డి ఆసుపత్రి, పీవీఆర్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించారు. ముందుగా మంత్రి బీపీ, ఈసీజీ, 2డీఈకో పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో డాక్టర్లు మాధురి,ప్రసాద్; బుంగ చిట్టిబాబు బృందం సేవలందించింది.

మహిళల రక్షణకు శక్తియాప్..

స్థానిక చెలికాని రామారావు స్మారక భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మంత్రి సుభాష్ విచ్చేసి మాట్లాడారు. మహిళల రక్షణకు శక్తియాప్ వినియోగించుకోవాలని, ప్రభుత్వం మహిళా, శిశు అభ్యున్నతికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4332 కోట్లు కేటాయించిందన్నారు. టీడీపీ ఆది నుంచి మహిళా సాధికారతకే పనిచేస్తోందన్నారు.ఈ సందర్భంగా మంత్రి కేకును కట్‌చేశారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, సీడీపీవో వరాహలక్ష్మి, ఎంఈవో నాగేశ్వరి, డాక్టర్ కవిత, విత్తనాల వెంకటరమణ, మేడిశెట్టి దుర్గ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీరలక్ష్మి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని అరికడదాం

» రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్

» పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి అరికడదామని ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా సోమవారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ రామచంద్రపురంలో 2024లో 1775 ట్రూనాట్ పరీక్షలు నిర్వహించగా 76 పాజిటివ్ వచ్చాయన్నారు. అర్బన్‌లో 2024లో 56 కేసులు, రూ రల్‌లో 184 కేసులు నమోదయ్యా యని తెలిపారు. అందులో ఎండీఆర్ కేసులు 3, హెచ్ఐవీ ఇన్‌ఫెక్టెడ్ టీబీ కేసులు 32 వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ చక్రధర్, డాక్టర్లు కల్యాణ్ బాబు, సుశీల, సౌమ్య, శేఖర్, పీపీ యూనిట్ డాక్టర్ కె.గోపికృష్ణ, ఎస్‌టీఎస్ డి.లీలావతి, ఎస్‌టీఎల్ఎస్ ఎండీ భానుబేగమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. క్షయవ్యాధిని ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక వైద్యం ద్వారా సక్రమంగా మందులు వాడితే పూర్తిస్థాయిలో నివారించడం సాధ్యమని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిషోర్ అన్నారు. క్షయవ్యాధిపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేట సీహెచ్‌సీ, ఐసీటీసీ, అవిడి పీహెచ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి నుంచి ర్యాలీ చేట్టారు. క్షయ నివారణపై ప్లకార్డులను ప్రదర్శించారు. అవగాహన పెంపొందించుకుని క్షయను నిర్మూలించుకోవచ్చునని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎం.వీరబాబు, ఎస్.శ్రీవిద్య, ఎ.మోహన్, డి.వెంకట్, ఐసీటీసీ సిబ్బంది ఎం.దుర్గాప్రసాద్, సుగుణ, ఆదిలక్ష్మి, సద్గుణరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆలమూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జొన్నాడలో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం, తిరుప్పవడ సేవలు నిర్వహించారు. మహిళ భక్తుల భక్తి గీతాలాపన నడుమ స్వామి అమ్మవార్లను పల్లకిలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నూకాంబికా కొత్తపూల జాతర

ఆలమూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కొత్తపూల జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవ సేవా కమిటీ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారి పూల గరగను మన్యం నుంచి తీసుకొచ్చి మొదుగుపూలతో ప్రత్యేకంగా తయారు చేసి గరగతో ఉత్సవం మొదలు పెట్టారు. పూల గరగకు హారతలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు

రావులపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని ముసలి రామాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీషిర్డిసాయిబాబా ఆలయ ప్రాంగణంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. దీనిలో భాగంగా సోమవారం ఆలయ కమిటీ సభ్యులు వేదమంత్రోచ్చరణల నడుమ పందిరి రాటమహోత్సవాన్ని నిర్వహించారు.

వాడపల్లిలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ఆత్రేయపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి రోజురోజుకు భక్తుల రద్దీ పెరిగిపోతుండడంతో సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టారు. తిరువీధులతో పాటు పలు రోడ్ల ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలంటూ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎస్ఐ రాముతో పాటు వివిధ శాఖల అధికారులు వీధులను పరిశీలించి సర్వే నిర్వహించారు. షాపులు, ఇళ్ళకు మార్కింగ్ వేశారు. హద్దుల ప్రకారం ఆక్రమణలు తొలగించాలని పేర్కొన్నారు. రోడ్లను ఆక్రమించి చిరువ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు చేపడతామన్నారు.

ప్రపంచ శాంతికి ప్రతీక ఇఫ్తార్

ఆత్రేయపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలీ మసీదులో శ్యామ్ జాదుగర్ మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి కోసం నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందును స్థానిక అనూష్ హోమ్‌లో నిర్వహించారు. ర్యాలీ పరిసర గ్రామాల ముస్లింలు విందులో పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన బస్సులు

రావులపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సులను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థా నిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సంస్థ ఆధ్వ ర్యం లో సమకూర్చిన రెండు అల్ట్రా డీలక్స్ బస్సులను డిపో మేనేజర్ రమణ ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. కార్యక్రమంలో గుత్తుల పట్టా భిరామారావు, జక్కంపూడి వెంకటస్వామి, మైగాపుల గురవయ్యనాయుడు, ఎన్‌వీ వీ సత్యనారాయణ, ధర్నాల రామకృష్ణ, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక పారా సంస్థ సమకూర్చిన వరద సహాయక కిట్లను ఎమ్మెల్యే బండారు పంపిణీ చేశారు. వరద ముం పు, అత్యవసర పరిస్థితుల్లో ఈ కిట్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సారా రహిత సమాజమే లక్ష్యం

ఆలమూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సారా రహిత సమాజానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేవీడీ ప్రసాద్ కోరారు. మండలంలోని జొన్నాడలో సోమవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత సమయమ నే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సు కు ఆయన విచ్చేసి మాట్లాడారు. అనేక రకాల నిషేధిత పదార్థాలు ఉపయోగించి తయారు చేస్తారని, దానిని తాగడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తున్నాయన్నారు. సారా విక్రయాలు, తయారీపై సమాచారాన్ని పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు అందించాలని ఆయన సూచించారు. సమావేశంలో తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు, సర్పంచ్ కట్టా శ్రీనివాస్, నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, అయినవిల్లి సత్తిబాబుగౌడ్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి

ఆలమూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పెల్ల సహకార సంఘంలో అవినీతి అక్రమాలు జరిగాయని, వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని స్థానిక రైతు అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ఆలమూరులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో రైతు దంగేటి బాపనయ్య తహశీల్దార్‌కు ఫిర్యాదు అందించారు. 2008లో రైతులకు రుణమాఫీ చేస్తే వాటిని రానియకుండా అడ్డుకున్నారని అప్పట్లో వీటిపై విచారణ చేసి రూ.16 లక్షలు బాధ్యుల నుంచి వసూలు చేయాలని సూచించారని అయితే వాటిపై ఇప్పటివరకు చర్యలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో వచ్చిన రూ.40 లక్షలు రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలకు జమ కాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.